క్లుప్తంగా

ఘనంగా గంగమ్మ అమ్మవారి తిరునాళ్లు



చీరాల టౌన్: మండలంలోని ఈపురుపాలెంలో వేంచేసియున్న గంగమ్మ అమ్మవారి తిరునాళ్లను ఆదివారం వైభవంగా నిర్వహించారు. తిరునాళ్లతో పాటుగా నూతనగా ప్రతిష్ఠించనున్న గంగమ్మ అమ్మవారి ఉత్సవ విగ్రహంతో గ్రామోత్సవం, 108 జలబిందెలతో గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తుల కొంగుబంగారంలా విరాజిల్లే గంగమ్మ అమ్మవారి నూతన ఉత్సవ విగ్రహం ప్రతిష్ఠతో పాటుగా తిరునాళ్లను వైభవంగా జరిపించారు. అమ్మవారిని 108 పసుపు జలబిందెలతో అభిషేకించిన అనంతరం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనం అందించారు. ఈ వేడుకల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనగా గంగమ్మ మందిర ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పుట్టంరాజుకు నంది పురస్కారం



పురస్కారం అందుకుంటున్న పుట్టంరాజు

అద్దంకి రూరల్: సర్వేపల్లి రాధాకృష్ణన్ 136వ జయంతి సందర్భంగా తిరుపతిలోని మహతీ ఆడిటోరియంలో అద్దంకి చెందిన పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి విద్యారంగంలో చేసిన విశిష్ట సేవలకు ఆదివారం నంది పురస్కారాన్ని అందజేశారు.

దేవస్థాన పాలకవర్గం ప్రమాణ స్వీకారం

అద్దంకి రూరల్: అద్దంకిలో వేంచేసి ఉన్న శ్రీచక్రసహిత కన్యకా పరమేశ్వరీ అమ్మవారి దేవస్థాన నూతన పాలకవర్గం ఆదివారం స్థానిక వాసవీ కల్యాణ మండపంలో ప్రమాణ స్వీకారం నిర్వహించారు. మాజీ అధ్యక్షుడు కోట శ్రీనివాసకుమార్ నూతన అధ్యక్షుడు ఊటుకూరి రామకోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి అరవపల్లి హనుమంతరావు, కోశాధికారి, నేరేళ్ల శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీపోకూరి వెంకట శ్రీనివాసరావులను, కమిటి సభ్యులను ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో సింగరకొండ కమిటీ అధ్యక్షుడు శరీరం నాగేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు చిన్ని శ్రీమన్నారాయణ, యూ కృష్ణసుభాన్, గట్టుపల్లి రామారావు, నాగసూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కీళ్ల నొప్పికి సరైన చికిత్స ఫిజియోథెరపీ

చీరాల: కీళ్ల పనితీరును సంరక్షించడంలో, కీళ్ల నొప్పిని తగ్గించడంలో సాధారణ జీవన నాణ్యతను పెంచడంలో రోగులకు ఫిజియోథెరపీ ఎంతో సహాయపడుతుందని కామాక్షి కేర్ హాస్పిటల్ ఎండి డాక్టర్ తాడివలస దేవరాజు అన్నారు. ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక విఠల్‌నగర్‌లోని చైతన్య మనోవికాస కేంద్రంలో డైరెక్టర్ వెంకన్నబాబు అధ్యక్షతన దేవరాజుకు, ఫిజియోథెరపిస్ట్, ప్రిన్సిపాల్ మాధురిలకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫిజియోథెరపీ ప్రాముఖ్యతను తెలిపారు. హాస్పిటల్ అందిస్తున్న సహాయ సహకారాలను ఎన్నటికి మరువలేమన్నారు.

సమాజ సేవకుడు రామయ్య మృతి

ఇంకొల్లు (చినగంజాం): సమాజ సేవకుడు, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి చుండూరి రామయ్య(87) శనివారం కన్నుమూశారు. ఇంకొల్లు మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన గ్రామాభివృద్ధి అధికారిగా తన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన ఆయన ప్రకాశం జిల్లా పరిషత్ కార్యాలయంలో సూపరింటెంటెంట్‌గా విధులు నిర్వహిస్తూ రిటైర్ అయ్యారు. ఆయన జీవిత కాలంలో ఇంకొల్లులో ప్రయాణికుల కోసం బస్ షెల్టర్, గరల్స్ హైస్కూల్‌లో రూ.2 లక్షలతో గది నిర్మాణం, బాయ్స్ హైస్కూల్‌లో సైన్సు ల్యాబ్‌కు అవసరమైన ఫర్నీచర్ సమకూర్చారు. భీమవరం గ్రామంలో హోమియో ఆసుపత్రి నిర్మాణం, గ్రామంలోని శ్మశానంలో తన సొంత నిధులతో గది నిర్మాణం చేశారు. లోక్‌సత్తా పార్టీకి మండల కన్వీనర్‌గా ప్రజల సమస్యలపై అధికారులతో పోరాడటమే కాకుండా అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయన బతికున్న సమయంలో సిద్ధార్థ వైద్య కళాశాలకు తన మరణించిన తరువాత భౌతిక కాయాన్ని అప్పగించేందుకు అంగీకార పత్రం ఇవ్వడంతో శనివారం ఆయన కుటుంబ సభ్యులు కళాశాల యాజమాన్యానికి అప్పగించారు.

రూ.3 లక్షలు స్వాధీనం

మార్టూరు: పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. సీఐ శేషగిరిరావు వివరాల మేరకు.. ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో మార్టూరులోని కొణిదెన రోడ్‌లో పంతులుగారి బిల్డింగ్‌లో జూదం ఆడుతున్నారని పోలీసులకు సమాచారం అందింది. మార్టూరు ఇన్స్పెక్టర్, ఎస్బీ హెడ్ కానిస్టేబుల్, సిబ్బంది పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేశారు. అనంతరం వారి నుంచి రూ. 3.69 లక్షలు స్వాధీనం చేసుకున్నామని, దీనిపై కేసు నమోదు చేశామని సీఐ పేర్కొన్నారు.



వేటపాలెం సెంటర్‌లో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహం



చీరాల అమరావారివీధిలో బియ్యం ప్యాకెట్ల అలంకరణలో వినాయకుడు



మార్టూరు విఘ్నేశ్వర కూరగాయల మార్కెట్‌లో కొలువుదీరిన గణనాథుడు



కారంచేడు గంగమ్మ గుడిబజార్‌లో ప్రత్యేక అలంకరణలో బొజ్జ గణపయ్య



మేదరమెట్లలో వినాయక విగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు

ఏకదంతాయ వక్రతుండాయ..

- ఘనంగా వినాయక చవితి వేడుకలు
- వీధివీధినా వెలసిన గణనాథులు
- వినాయక మండపాల వద్ద సందడి చేసిన చిన్నారులు, యువత

మార్టూరు/యద్దనపూడి/చినగంజాం/కారంచేడు: తల్లి రక్షణకు ప్రాణమిచ్చిన మాతృవాక్పరిపాలకుడు, పార్వతీ తనయుడు, ఏకదంతుడైన వినాయకుడి పండుగ వినాయక చవితిని ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. శనివారం కారంచేడు మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక చవితి వేడుకలు ఘనంగా ప్రారంభించారు. ఉదయం నుంచి పోలీసుశాఖ ప్రత్యేక అనుమతులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక పందిళ్లలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కారంచేడు, కుంకలమర్రు, స్వర్ణ, దగ్గుబాడు, కొడవలివారిపాలెం, కేశవరప్పాడు, ఆదిపూడి, తిమిడెదపాడు, జరుబులవారిపాలెం, యర్రంవారిపాలెం, నాయుడువారిపాలెం గ్రామాల్లోని వినాయక విగ్రహాలను పోటాపోటీగా నెలకొల్పారు. గ్రామంలోని కాలువసెంటర్, యజ్ఞశాలపేట, స్టేట్‌బ్యాంక్ ఎదురు వీధి, మాస్కో బజారు, మధ్య బస్టాండు, బందెలదొడ్డి, రామాలయం బజారు, కట్టమీద, ఉప్పరపాలెం ప్రాంతాల్లో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విగ్రహాల ఏర్పాటుకు గ్రామాల్లో ప్రత్యేక పందిళ్లు ఏర్పాటు చేసి విగ్రహాలను నెలకొల్పారు.

★ మార్టూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మార్టూరులో 500 మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. మార్టూరు లోని తూర్పు బజారు, స్థానిక విఘ్నేశ్వర కూరగాయల మార్కెట్లో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సీఐ మద్దినేని శేషగిరిరావు ఆధ్వర్యంలో మండలంలో ప్రశాంత వాతావరణంలో చవితి వేడుకల నిర్వహణను పర్యవేక్షించారు.

★ యద్దనపూడి మండలంలోని పూనూరు, గన్నవరం, యద్దనపూడి, జాగర్లమూడి, వింజనంపాడు, యనమదల, పోలూరు, తదితర గ్రామాల్లో వినాయక విగ్రహాలను పోటాపోటీగా నెలకొల్పి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎవరికి వారే వివిధ విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా మండపాలను అలంకరించారు.

★ చినగంజాం మండలంలోని మోటుపల్లి, బాపయ్య నగర్, పెదగంజాం సముద్ర తీరంలో విగ్రహాలను నిమజ్జనం కార్యక్రమాన్ని నిర్వహించారు. వినాయక విగ్రహాలను ఊరేగింపుగా సముద్ర తీరానికి తీసుకొని వెళ్లి సముద్రంలో నిమజ్జనం చేశారు.

★ పర్చూరులోని తూర్పు బజారు, మధ్యబజారు, జయంతి పేట, టీ నగర్, లక్ష్మీపురం తదితర ప్రదేశాలలో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశారు. విగ్రహాలు ఊరేగింపు సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు అన్ని ఏర్పాటు చేసినట్లు మార్టూరు రూరల్ సీఐ జీఎల్ శ్రీనివాసరావు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వినాయక చవితి పూజలు

చీరాల అర్బన్/చీరాల టౌన్/వేటపాలెం: వినాయక చవితి పండుగను పురస్కరించుకొని చీరాల, వేటపాలెం మండలాల్లో భక్తి శ్రద్ధలతో వినాయకుడికి పూజలు నిర్వహించారు. పందిళ్లపల్లిలోని పోతురాజు స్వామి ప్రాంగణంలో, వేటపాలెం గడియార స్థంభం సెంటర్, రైల్వే స్టేషన్‌రోడ్డులో ప్రతి వీధిలో గణనాథుడి విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రత్యేక భజనలు, సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటు..

అద్దంకి/అద్దంకి రూరల్/బల్లికురవ/జే.పంగులూరు/మేదరమెట్ల: వినాయక చవితి సందర్భంగా మండలంలోని గ్రామగ్రామాన, అద్దంకిలోని వాడవాడలా గణపతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండపాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. రాత్రులు భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.



కొణిదెనలోని గోశాలలో ఏర్పాటు చేసిన గణనాథుడు

★ బల్లికురవ మండలంలో సుమారు 60 వరకు నిలువెత్తు గణనాథులను ప్రత్యేక మండపం ఏర్పాటుతో పూజలు నిర్వహించారు. సోమవారం నుంచి నిమజ్జన కార్యక్రమాలు ఉండటంతో పోలీసులు ఏర్పాట్లకు సమాయత్తమవుతున్నారు. కొణిదెన గ్రామంలోని యజ్ఞ నారాయణ మెమోరియల్ గోశాలలో గోవులను ప్రత్యేకంగా అలంకరించి వినాయకుని విగ్రహం ఏర్పాటుతో పూజలు నిర్వహించారు.

★ జే.పంగులూరు, కొరిశపాడు మండలంలో భక్తులు మొత్తం 50కి పైగా వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. పోలీసుల ఆదేశాలను అనుసరించి వినాయక మండపాలను ఏర్పాటు చేశారు. విగ్రహాల వద్ద ఉదయం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేదరమెట్లలోని అపార్టుమెంట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద భక్తజన బృందం భజనలు చేశారు.



స్వామివారి సన్నిధిలో కారంచేడు భక్త సమాజ మండలి ప్రత్యేక పూజలు



చినగంజాంలో వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



పూనూరు తోపు సెంటర్‌లో గణనాథుడి వద్ద పూజలు చేస్తున్న భక్తులు



పంగులూరులో గణనాథులను మండపానికి ఊరేంగింపుగా తీసుకొని వెళ్తున్న గ్రామస్తులు



అద్దంకి పట్టణంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలు

వినాయక నిమజ్జనోత్సవాలు ప్రారంభం



పోలీసులు, సిబ్బందికి సూచనలందిస్తున్న రూరల్ సీఐ సత్యనారాయణ



వాడరేవు తీరంలో గణేషుడిని నిమజ్జనం చేస్తున్న చిన్నారులు

చీరాల టౌన్: వినాయక చవితి చలువ పందిళ్లల్లో ఏర్పాటు చేసిన గణనాధులు నిమజ్జనాలకు తరలివెళ్తున్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లోని గణనాథులను ఊరేగింపుల అనంతరం స్ట్రయిట్‌కట్ కాలువలో నిమజ్జనం చేస్తున్నారు. అలానే నియోజకవర్గంతో పాటుగా పర్చూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథులను తప్పెట్ల ఊరేగింపుల అనంతరం గంగ ఒడిలోకి వాడరేవు తీసుకువచ్చి నిమజ్జనం చేస్తున్నారు. ఈనేపథ్యంలో చీరాల రూరల్ సీఐ నిమ్మగడ్డ సత్యనారాయణ ఆధ్వర్యంలో రూరల్ ఎస్సై శివకుమార్, మెరైన్ ఎస్సై సుబ్బారావు, సివిల్, మెరైన్, ఏఆర్ పోలీసులు, గజ ఈతగాళ్లతో బందోబస్తు నిర్వహిస్తూ ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టారు. నిమజ్జనోత్సవాలు ముగిసేంత వరకు వాడరేవు తీరంలో ప్రత్యేకంగా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, పోలీసులు సూచించిన ప్రదేశంలోనే సముద్రంలో స్నానాలు చేయాలన్నారు.

నిమజ్జనోత్సవాల్లో అపశ్రుతులకు చెక్



సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ రమణయ్య

చినగంజాం: వినాయక నిమజ్జనోత్సవాలు జరగనున్న దృష్ట్యా ఎటువంటి అపశ్రుతులు జరగకుండా గట్టి చర్యలు చేపట్టనున్నట్లు ఇంకొల్లు సీఐ రమణయ్య అన్నారు. ఆదివారం చినగంజాం పోలీస్ స్టేషన్‌లో నిమజ్జనోత్సవ కార్యక్రమాల కోసం సిబ్బందితో బందోబస్తు ఏర్పాట్ల చేయనున్న దృష్ట్యా ఆయన పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. చినగంజాం మండల పరిధిలో మోటుపల్లి, పల్లెపాలెం, పెదగంజాం పంచాయతీల్లోని సముద్ర తీరంలోను రాజుబంగారు పాలెం పంచాయతీ అమీన్ నగర్‌లోని రొంపేరు కాలువలోను నిమజ్జనం జరుగనున్నాయి. ఈ సందర్భంగా సర్కిల్ పరిధిలోని 30 మంది పోలీస్ సిబ్బందితో సోమవారం ఉదయం నుంచి బందోబస్తు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అదే విధంగా నిమజ్జనం నిర్వహించే నిర్వాహకులు ముందుగా పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఇంకొల్లు సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు పలువురి బాసట



మేదరమెట్లలో విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు



చీరాల నుంచి భట్టిప్రోలు మండలానికి తరలిస్తున్న దుస్తులు

మేదరమెట్ల: విజయవాడ వరద ప్రభావంతో నష్టపోయిన ప్రజానీకానికి బాసటగా నిలిచేందుకుగాను కొరిశపాడు మండల సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం విరాళాలను సేకరించారు. మండల సీపీఎం కార్యదర్శి మెండ్రు ఆంజనేయులు ఆధ్వర్యంలో మేదరమెట్లలో విరాళాలను సేకరించారు. సేకరించిన విరాళాలను సీఎం సహాయనిధికి పంపించనున్నట్లు ఆంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో మాణిక్యారావు, రవీంద్రబాబు, సుబ్బారావు, జయమ్మ, వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు యూటీఎఫ్ సహకారం

చీరాల అర్బన్: విజయవాడ, లంక ప్రాంతాలైన భట్టిప్రోలు, కొల్లూరు, రేపల్లె మండలాల్లో వరద బాధితులకు తమ వంతు సహాయంగా యూటీఎఫ్ ఆధ్వర్యంలో దుస్తులను సేకరించి వరద ప్రభావిత ప్రాంతాలకు ఆదివారం తరలించారు. యూటీఎఫ్ రాష్ట్ర శాఖ అనుమతితో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వినయ్‌కుమార్, ఎ.శ్రీనివాసరావు సూచనలతో యూటీఎఫ్ చీరాల ప్రాంతీయ మండలాల బాధ్యులు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా వారి ఇంటిలోని దుస్తులను సేకరించి ప్రాంతీయ కార్యాలయానికి తరలించారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ పి.సురేష్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు పి.సీతారామరాజు, చీరాల పట్టణ అధ్యక్షుడు వెలుగొండారెడ్డి, ఎస్.రాజేష్, సయ్యద్ జానీబాషా, కుర్రా శ్రీనివాసరావు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యతతో దేశాభివృద్ధి

చీరాల అర్బన్: ప్రపంచంలో వంద కోట్ల మంది నిరక్షరాస్యులు ఉంటే అందులో 33 కోట్ల మంది ఒక్క దేశంలోనే ఉన్నారని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్ హాలులో అంతర్జాతీ అక్షరాస్యత దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎ.నాగవీరభద్రాచారి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో నాయకులు ఎ.రామారావు, పోలుదాసు రామకృష్ణ పాల్గొన్నారు.

చినగంజాం: జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. సామాజిక సేవా కార్యకర్త వూటుకూరి రవీంద్రనాథ్‌గుప్త ఆధ్వర్యంలో స్థానిక వాల్మీకి వృద్ధాశ్రమంలో పలువురు వృద్ధులకు అక్షరాస్యత దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆశ్రమంలో నిరక్షరాస్యులైన ఎం వెంకటరమణ, ఎం వెంకటేశ్వర్లు తదితరులు సంతకం చేసే విధంగా తర్ఫీదు ఇచ్చి ప్రతి ఒక్కరూ అక్షరాస్యులు కావాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో పలువురు సామాజిక సేవ కార్యకర్తలు పాల్గొన్నారు.



వృద్ధాశ్రమంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న వృద్ధులు

విద్యుదాఘాతంతో పాడి గేదెలు మృతి

- నాలుగు గేదెలు, ఒక మేక మృతి



ప్రమాదంలో మృతి చెందిన గేదెలు, మేక

చినగంజాం: విద్యుత్ వైరు తెగిపడటంతో మేత మేసేందుకు వెళ్లిన పాడి గేదెలు విద్యుత్ షాక్ గురై మృతి చెందాయి. ఈఘటన ఆదివారం మండలంలోని కడవదుకురు గ్రామంలో చోటు చేసుకుంది. విద్యుత్ శాఖ జేఈ బీమానాయక్, బాధితుడు శింగంశెట్టి రామాంజనేయులు వివరాల మేరకు.. మండలంలోని గ్రామంలోని పాతపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో వెనుకవైపు ఉన్న ఇసుక దిబ్బల వద్ద ఆదివారం 11 కేవీ విద్యుత్ తెగిపడింది. మామూలుగా ప్రతి రోజు గ్రామానికి చెందిన పలువురు పశుపోషకులు తమ గేదెలను, మేకల కాపరులు తమ మేకలను ఆ ప్రాంతంలో మేత మేపుకుంటూ ఉంటారు. ఆదివారం కూడా అదే మాదిరిగా వెళ్లిన మేకల కాపరి కొమ్మనబోయిన సుబ్రహ్మణ్యం తన మేకల మందలోని ఒక మేక తెగిపడిన విద్యుత్ తీగను తాకి చనిపోవడంతో భయాందోళనకు గురై మిగిలిన మేకల మందను అటువైపు వెళ్లకుండా అప్రమత్తమై ఆ ప్రాంతం నుంచి వెళ్ళిపోయాడు. అయితే విద్యుత్ తీగ తెగిన సమాచారాన్ని స్థానికంగా గేదెల మేపే వాళ్లకు తెలియజేయలేదు. దాంతో అటువైపుగా గేదెలను మేపుకుంటూ వచ్చిన శింగంశెట్టి రామాంజనేయులు తన ఆరు గేదెలను ఆప్రాంతంలోనికి తోలుకొని వచ్చాడు. విద్యుత్ తీగను తాకిన నాలుగు గేదెలు వెంటనే అక్కడికక్కడే విద్యుదాఘాతానికి గురై చనిపోయాయి. దాంతో విషయం తెలుసుకున్న అతడు మిగిలిన గేదెలను కాపాడుకున్నాడు. మృతి చెందిన గేదెలు విలువ సుమారు రూ 1.20 లక్షలు ఉంటుందని, మేక విలువు రూ.8 వేలు ఉంటుందని బాధితులు తెలిపారు. ఈ విషయమై జేఈని వివరణ కోరగా తెగిపడిన విద్యుత్ కండక్టర్ వైరు నేలమీద పడకుండా గడ్డిమీద పడటం వలన విద్యుత్ ప్రసారం జరిగి గేదెలు చనిపోయాయని, మాములుగా కండక్టర్ వైరు తెగిపడిన సందర్భాలలో కరంటు ట్రిప్ జరిగి విద్యుత్ ప్రసారం ఆగుతుందని, అలా జరగక పోవటం వలన ప్రమాదం చోటు చేసుకుందని తెలిపారు. ప్రమాదం సమాచారం తెలుసుకున్న ఈఈ జాన్ థామస్ సబ్ స్టేషన్‌కు చేరుకొని సమీక్షించినట్లు తెలిపారు.

ఆటోను ఢీ కొన్న బైకు

మేదరమెట్ల: బైకు ఆటోను ఢీకొట్టిన ఘటన శనివారం కొరిశపాడు ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో చోటు చేసుకుంది. ఈప్రమోదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. కొరిశపాడు జాతీయ రహదారి పక్కన ఉన్న రొయ్యల ఫ్యాక్టరీలో బాక్సులను దించి తిరిగి మేదరమెట్ల వైపునకు వస్తున్న ఆటోను ఒంగోలు వైపు నుంచి విజయవాడకు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలు కాగా క్షతగాత్రుడిని వైద్యశాలకు తరలించారు. గాయపడిన వ్యక్తి పేరు ఇమ్మానుయేలుగా స్థానికులు తెలిపారు.

మోటార్ బైక్‌ను ఢీకొట్టిన కారు

వేటపాలెం: వేగంగా వచ్చి అదుపుతప్పి ఆగి ఉన్న మోటార్ బైక్‌ను కారు ఢీకొట్టిన ఘటనలో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. ఆదివారం 216 జాదాయ రహదారి బైపాస్ రోడ్డుపై కొత్తరెడ్డిపాలెం వద్ద ఈప్రమాదం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. అడవీధిపాలేనికి చెందిన యువకుడు మునగాని అజయ్‌కుమార్ బైక్‌పై పందిళ్లపల్లి వైపు వస్తున్నాడు. కొత్తరెడ్డిపాలెం జంక్షన్ వద్ద ప్రధాన రోడ్డులో కారు వేగంగా స్తుండడాన్ని గమనించి బైక్‌ను ఆపి ఉంచాడు. అయితే వేగంగా వస్తున్న కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న బైక్‌ని ఢీకొట్టి కారు రోడ్డు మార్జిన్‌లోకి వెళ్లిపోయింది. దీంతో అజయ్‌కుమార్‌కు కాలు విరిగి తీవ్రగాయాల పాలయ్యాడు. ఘటనా స్థలాన్ని ఎస్సై ఎం వెంకటేశ్వర్లు పరిశీలించి కేసు నమోదు చేసుకొని యువకుడిని 108లో చికిత్స నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. కారు నడుపుతున్న వ్యక్తి మద్యం మత్తులో ఉన్నట్లు వివిస్తున్నారు.

మాజీ సర్పంచ్ మృతి

బల్లికురవ: ప్రమాదవశాత్తు బాత్రూంలో కాలు జారిపడి మాజీ సర్పంచ్ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని మండల కేంద్రమైన బల్లికురవలో ఆదివారం జరిగింది. అందిన సమాచారం మేరకు బల్లికురవ గ్రామ మాజీ సర్పంచ్ పావులూరు సత్యనారాయణ (65) స్నానం చేయడం కోసం బాత్రూమ్‌లోకి వెళ్లాడు. ఈ క్రమంలో అక్కడ ఆయన కాలు జారి పడటంతో తలకు దెబ్బ తగిలింది. దీంతో క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఈయన 2001 నుంచి ఐదు సంవత్సరాల పాటు సర్పంచ్‌గా బల్లికురవతో పాటు ఆ పంచాయతీలోని కొండాయపాలెం గ్రామం అభివృద్ధికి పాటుపడ్డారు. మృతుడికి భార్య, ఇరువురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు.